# 161 మంది బాల కార్మికులకు విముక్తి: సీపీ సాయి చైతన్య

**– ముగిసిన ఆపరేషన్ స్మైల్ 52 కేసులు నమోదు**



**నిజామాబాద్ జిల్లా, 01 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** తెలంగాణ సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ.. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. బైక్ ర్యాలీ అనంతరం జరిగిన సభలో ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్‌కు నోటీసుల డ్రామా ఆడుతోంది. గ్యారంటీల అమలులో విఫలమై, ప్రజల దృష్టిని మళ్లించేందుకు సిట్‌లు, కమిషన్ల పేరుతో కాలక్షేపం చేస్తోంది అని విమర్శించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే యావత్ తెలంగాణ సమాజానికే నోటీసులు ఇవ్వడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. నిజామాబాద్ అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్, రాజకీయ వేధింపులపైనే దృష్టి పెట్టిందని ధ్వజమెత్తారు. నగరం నడిబొడ్డున వందలాది బైక్‌లతో బీఆర్ఎస్ శ్రేణులు నిర్వహించిన ఈ ర్యాలీతో నగరం గులాబీమయమైంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీలక్ష్మి తిరుపతమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం









**బోధన్, నిజామాబాద్ జిల్లా, 01 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** సాలూర మండల పరిధిలోని కొప్పర్తి క్యాంప్‌లో శ్రీ గోపయార్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తిభావం వెల్లివిరిసింది. మేష లగ్న పుష్కరాంశ సుముహూర్తమున అర్చకులు రాజ్కుమార్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకకు ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారికి ఘనస్వాగతం పలికి, తీర్థప్రసాదాలను అందజేసింది. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రమే కొప్పర్తి క్యాంప్ నుండి పసుపు బండ్ల ఊరేగింపు వైభవంగా సాగింది. ఆదివారం సాయంత్రం సాలంపాడ్ నుండి ప్రభలు, కుంకుమ బండ్లు మేళతాళాలతో గ్రామానికి చేరుకున్నాయి. మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పరిసర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు గ్రామంలో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

# అమరవీరురాలికి అశ్రునివాళి.. వీడ్కోలు పలికిన జనవాహిని

- మోస్రాలో ప్రభుత్వ లాంఛనాలతో సౌమ్య అంత్యక్రియలు
- కడసారి చూపు కోసం పోటెత్తిన నిజామాబాద్ జిల్లా
- సౌమ్య పాడె మోసిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం
- గంజాయి మాఫియా అంతమే లక్ష్యం : మంత్రి








**నిజామాబాద్ జిల్లా, 01 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** కర్తవ్య నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి, గంజాయి స్మగ్లర్ల ఘాతుకానికి బలైన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య అంతిమయాత్ర సాశ్రు నయనాల మధ్య ముగిసింది. మృత్యువుతో పోరాడి ఓడిన ఈ వీ రనారికి ఆమె స్వగ్రామం మోస్రాలో ఆదివారం సాయంత్రం ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిం చారు. ఒకవైపు పోలీసుల గౌరవ వందనం, మరోవైపు వేలాది మంది ప్రజల నినాదాలతో మోస్రా గ్రామం దద్దరిల్లింది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి సౌమ్య కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం ఆమె పార్థివ దేహాన్ని మోస్రాకు తరలించారు. తన ఊరి బిడ్డను కడసారి చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇంటి వద్ద సౌమ్య భౌతికకాయాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదనతో చేసిన రోదనలు అక్కడి వారిని కలిచివేసాయి. గ్రామం మొత్తం విషాదంలో మునిగిపోయింది. అంత్యక్రియలకు హాజరైన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా సౌమ్య పాడె మోసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సౌమ్య త్యాగం వెలకట్టలేనిది. గంజాయి మాఫియాపై పోరాటంలో ఆమె ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది అని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున భారీ సాయాన్ని ప్రకటించారు. తక్షణ సాయంగా కుటుంబానికి రూ. 1 కోటి నగదు, సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ, ఆమె పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు వచ్చే పూర్తి వేతనాన్ని కుటుంబానికి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎక్సైజ్ పోలీసులు ప్రాణ రక్షణ కోసం త్వరలోనే ఆయుధాలు సమకూరుస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎక్సైజ్ శాఖ ఉన్న తాధికారులు, పెద్ద సంఖ్యలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీ సులు గాలిలోకి కాల్పులు జరిపి సౌమ్యకు తుది గౌరవం సమర్పించారు.

# బోధన్ కమ్మ సంఘం అధ్యక్షుడిగా పల్లెంపాటి శివన్నారాయణ ఎన్నిక



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 01 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బోధన్ పట్టణ శివారులోని కమ్మ సంఘ భవనంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కమ్మ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పల్లెంపాటి శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా దావులూరి హరినాథ్ బాబు ఎంపికయ్యారు. కోశాధికారిగా పల్లెంపాటి శ్రీధర్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వెనిగళ్ళ సునీల్ కుమార్ చౌదరి, వెలగ తిలక్, అడి నారాయణలు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా యలవర్తి రవీంద్రబాబు, శ్రీ రెడ్డి వెంకటే శ్వరరావు, మద్దినేని శ్రీనివాసరావులు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వర్ని, బోధన్, కోటగిరి సహా ఎనిమిది మండలాల ప్రతినిధులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. సామాజిక సేవా రంగంలో సంఘం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ప్రతినిధులు ఆకాంక్షించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి





**నిజామాబాద్ జిల్లా, 01 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** రాబోయే భీమ్‌గల్ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో ఉంటూ విజయం సాధించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భీమ్‌గల్‌లో ఏర్పాటు చేసిన అభ్యర్థులు, ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ.. అభ్యర్థులు ఓటర్ల వద్దకు వెళ్లేటప్పుడు ప్రజల సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకోవాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి నమ్మకాన్ని చూరగొన్నప్పుడే విజయం సాధ్యమవుతుందని, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు ప్రచార సరళిపై దిశానిర్దేశం చేశారు. వార్డుల వారీగా పటిష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని ఆయన దిక్సూచిని అందించారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ పట్టణ అధ్యక్షులు కనికరమదు, కమ్మర్‌పల్లి మండల ఉపాధ్యక్షులు ఎలాల వెంకటరెడ్డి, ముఖ్య నాయకులు బజరంగ్ దివాల్ తో పాటు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పశుగ్రాసంపై రైతులకు అవగాహన అవసరం: డీన్ ఉదయ్‌కుమార్

**– బోధన్ గోశాలలో పశు వైద్య శిబిరం ప్రారంభం**



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 01 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** పశుగ్రాసం విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన ఆహారం అందించినప్పుడే పశువుల ఆరోగ్యం నిలకడగా ఉంటుందని వెటర్నరీ వర్సిటీ డీన్ ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని గోశాలలో లయన్స్ క్లబ్, కోరుట్ల వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పశువుల జీర్ణ క్రియ మనుషుల కంటే భిన్నంగా ఉంటుందని, దానా కాకుండా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వ డం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఏడు రోజుల పాటు ఈ వైద్య శిబిరాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గోశాల కమిటీ సభ్యులు నేపాల్ సింగ్, వినోద్ పట్వారి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యలు ఆపాలి



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 01 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు సిట్ నోటీసులు జారీ చేయడం రాజకీయ కక్షసాధింపు చర్యేనని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఆశయాల కోసం పోరాడి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన కేసీఆర్‌ను ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం ప్రతిపక్ష నేతలపై వేధింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి నోటీసుల పర్వానికి తెరలేపిందని విమర్శించారు. తక్షణమే ఇలాంటి వేధింపు చర్యలు ఆపాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తేళ్ల రవికుమార్ తో పాటు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా శివకళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం



**డిడి9 వార్త గుడిహత్నూర్ మండలం :** కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఆదివారం శివకళ్యాణం అత్యంత ఘనంగా జరిగింది. భక్తుల జయజయధ్వానాల మధ్య శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కీ.శే. మిట్టపల్లి రాజమ్మ-రాజయ్య దంపతుల జ్ఞాపకార్థంగా వారి మనుమలు, మనుమరాళ్లు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఈ శివకళ్యాణాన్ని ఈ ఏడాదీ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివకళ్యాణాన్ని తిలకించేందుకు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, వందలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వారి కూతుళ్లు అల్లుండ్లు కొడుకులు కోడండ్లు మనమాలు మనమరాలు సీనియర్ జర్నలిస్ట్ నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు

